

అమృతసాగర క్షేత్రం ఆలయంలో ధర్మకర్తలతో, కమిటీ సభ్యులతో
స్వామి కృష్ణానందగిరి తదితరులతో శ్రీ వీరారెడ్డి



అమృతసాగర క్షేత్ర ఆలయ ప్రాంగణంలో శ్రీ వీరారెడ్డి గారి పరివారం
మరియు తదితరులు

ధర్మదాత శ్రీపతి వీరారెడ్డి

(సంక్షిప్త జీవన రేఖలు)



జననం : 12-10-1924
మరణం : 27-12-2006
(వ్యయ నామ సంవత్సర మార్గశిర బ॥ సప్తమి)

సంతాపసభ : 07-01-2007
గ్రామం : ఏన్కాయంపల్లి,
మం॥ ఆమనగల్లు,
పాలమూరు జిల్లా



శ్రీపతి వీరారెడ్డి శ్రీమతి అహల్యాదేవి దంపతులు



శ్రీమతి అహల్యాదేవితోపాటు పుత్రికలూ - పుత్రులు : డా॥ ఉమ,
శ్రీమతి నిర్మల, శ్రీమతి రమ, డా॥ కరుణాకర్ రెడ్డి, శ్రీనారాయణ రెడ్డి

ధర్మదాత శ్రీపతి వీరారెడ్డి

(సంక్షిప్త జీవన రేఖలు)

శ్రీరామ జయరామ జయ జయ రామ
తన్నో రామః ప్రచోదయాత్

- ఆచార్య కసిరెడ్డి

ప్రచురణ

శ్రీ మలయాళస్వామి ఆశ్రమం

అయ్యసాగర క్షేత్రం, ఆమనగల్లు మండలం
పాలమూరు జిల్లా

ధర్మదాత శ్రీపతి వీరారెడ్డి

(సంతాప సభ సందర్భంగా జీవన రేఖలు)

తేది : 2007 జనవరి 7

వ్యయనామ సం॥ర మార్గశిర బ॥ చవితి

కూర్పు : **ఆచార్య కసిరెడ్డి**

ప్రతులు : 2000

ప్రతులకు:

మేనేజర్
శ్రీ వీరభద్రేశ్వర - త్రిపురాంతకేశ్వర ఆలయం
అయ్యసాగర క్షేత్రం
రాంనూతల ఆలయం నర్సరీ,
ఆమనగల్లు మం॥
జిల్లా :మహబూబ్‌నగర్, (ఆం.ప్ర.)

ముద్రణ:

కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్
40, ఎపిహెచ్‌బి, విద్యానగర్
హైదరాబాద్ - 44
ఫోన్: 040-27618261

అమూల్యం

శ్రీశ్రీశ్రీ నిత్యశుద్ధానందగిరి స్వామి వారు పంపించిన -

శ్రద్ధాంజలి

కీ॥శే॥ ధర్మదాత శ్రీ శ్రీపతి వీరారెడ్డి గారు



శ్రీ మలయాళ స్వామి రామకోటి జపయజ్ఞాశ్రమానికి, యజ్ఞానికి ఉపాధ్యక్షులుగా గత రెండు దశాబ్దాలుగా విశేష సేవ చేసిన వారు శ్రీ శ్రీపతి వీరారెడ్డిగారు. మన పత్రిక పేరు రిజిష్టరు కావడంలో కరస్పాండెన్స్ నడిపి పరిశ్రమించినవారు. రెవెన్యూ శాఖలో ఉన్నతోద్యోగం చేస్తూనే, దేవాలయ వ్యవస్థకు సంబంధించి ప్రత్యేకంగా అధ్యయనం చేసి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా శక్తి మేరకు కృషి చేసినవారు. అయ్యసాగర క్షేత్రానికి భూమినిచ్చి ఆలయ పునరుద్ధరణలో వివిధ నిర్మాణాలలో తమదైన యోగదానాన్ని అందించిన వారు. తమ గ్రామంలో ఆలయానికి, పశు వైద్యశాల నిర్మాణానికి, ఉన్నత పాఠశాల వికాసానికి అపూర్వంగా తోడ్పడినవారు. తన సొంత భూమిలో కొంత బీదసాదలకు పంచినవారు. తమ పాత భవంతి స్థలాన్ని తమ గ్రామ దేవాలయానికి దానంగా ఇచ్చినవారు. మన జపధ్యాన జ్ఞాన యజ్ఞాలను నిరంతరం ప్రోత్సహించినవారు. ఆరోగ్యం బాగా లేకున్నా 26వ వేదాంత విజ్ఞాన మహాసభలలో చివరిసారిగా ఆమనగల్లులో పాల్గొన్న వారు, ధర్మదాతగా కీర్తి ప్రతిష్ఠలార్జించిన వారు. హిందూ సనాతన వేదాంత ధర్మం ప్రపంచానికే శాంతినీ, జ్ఞానాన్నీ ప్రసాదిస్తుందని దృఢంగా నమ్మినవారు... అలాంటి శ్రీ శ్రీపతి వీరారెడ్డి గారు 27 డిసంబర్ 2006 (మార్గశిర శు॥ సప్తమి) బుధవారం నాడు సాయంత్రం 5 గం॥ 20 ని.లకు పరమ పదించారు. రెండు ఆశ్రమాల భక్తుల సమేతంగా వారి ఆత్మకు శాంతి కలగాలని శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. వారి పరివారానికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాం.

- నిత్య శుద్ధానందగిరిస్వామి

గంగాపురం ఆశ్రమం
7-01-2007

కీ॥శే॥ శ్రీ శ్రీపతి వీరారెడ్డి పరివారం

గ్రామం : ఎక్కువాయిపల్లి (ఎక్కువపల్లి), మండలం : ఆమనగల్లు, జిల్లా : పాలమూరు

తల్లి దండ్రులు: **కీ॥శే॥ శ్రీమతి తారకమ్మ**

కీ॥శే॥ శ్రీ శ్రీపతి నారాయణరెడ్డి

ధర్మపత్ని : **శ్రీమతి అహల్యమ్మ**

తోబుట్టువులు :

1. అక్కగారు శ్రీమతి మోహనమ్మ, ఖుదాబక్ష్‌పల్లి
2. అక్కగారు శ్రీమతి రామేశ్వరమ్మ, అజలపురం
3. అక్కగారు శ్రీమతి కౌసల్యమ్మ, మహమదాబాదు (నయనోనిపల్లి)
4. చెల్లెలు శ్రీమతి సుదర్శనమ్మ, పడకల్లు

కూతుళ్లు - అల్లుండ్రు

1. డా॥ ఉమ, భర్త సుధాకర్ రెడ్డి
2. శ్రీమతి నిర్మల, భర్త రామారెడ్డి
3. శ్రీమతి రమ, భర్త జ్ఞానేశ్వర్ రెడ్డి

కొడుకులు - కోడండ్రు

1. డా॥ కరుణాకర్ రెడ్డి, భార్య జ్యోతి
2. శ్రీ నారాయణ రెడ్డి, భార్య సురేఖ

మనుమలు - మనుమరాండ్రు

1. స్వాతి, మను - ఉమగారి సంతానం
2. పల్లవి, ప్రశాంతి - నిర్మల గారి సంతానం
3. ప్రజ్ఞ, ప్రణీత - రమ గారి సంతానం
4. వివేక్, వినయ్ - కరుణాకర్‌గారి సంతానం

(శ్రీ వీరారెడ్డి గారి పరివారం ఫోటో కవర్ 3వ పేజీలో చూడవచ్చు)

విషయ సూచిక

బాల్యం - విద్యాభ్యాసం

అది 1924 వ సం॥రం. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనా కాలం. తెలుగు సంస్కృతికి దిక్కులేని కాలం. తెలంగాణ మరత్వాడా కర్ణాటక మొత్తం 16 జిల్లాలను పరిపాలిస్తున్న నిజాం. తన తండ్రి మహబూబు అలీ పాదుషా ఉదాత్త మార్గాన్ని వదలి హిందూ ముస్లింలు తనకు రెండు కళ్లంటూనే, ఏకపక్షపాలన కొనసాగిస్తున్న కాలం.

అది రక్తాక్షి సంవత్సరం. వీరారెడ్డి 1924 అక్టోబర్ 12న వారు జన్మించారు. పెద్దక్క మోహనమ్మగారి వివాహం అదే సంవత్సరం జరిగింది. పాల్గుణ మాసంలో 8 సం॥ల మోహనమ్మ వివాహం ఖుదాబక్ష్‌పల్లి పాశం నారాయణరెడ్డితో వైభవంగా జరిగింది. శ్రీ వీరారెడ్డి ఈ విషయం సంతోషంగా చెప్పేవారు. కళ్ళు విప్పుకొన్న పసికూనకు పెళ్ళి సంగతి తెలియదు గాని, తన పుట్టుకలోనే అక్క పెళ్లి జరిగిందన్న సంతోషం.

శ్రీ వీరారెడ్డి తల్లి తారకమ్మ, తండ్రి నారాయణరెడ్డి. వ్యవసాయదారుల కుటుంబం. వీరి పూర్వీకులు ముదివెన్నులోనూ, ఎక్కువపల్లిలోనూ వ్యవసాయాలు చేస్తుండేవారు. తొలిదశలో ఎవరు ఎక్కడైనా వ్యవసాయాలు చేసుకోవడం ఆచారంగా ఉండేది. కాని కొన్నాళ్లకు ఒకటి రెండు పాయలు ముదివెన్నులో, మరో ఒకటి రెండు పాయలు ఎక్కువ పల్లిలో స్థిరపడ్డాయి. చుట్టూరా చరికొండ గుట్టలు, ఎత్తయిన భూములూ, తాటిచెట్లు, లోతట్టు ప్రాంతంలో అందంగా కనిపించే ఎక్కువపల్లె.

ఎక్కువపల్లి అని ఎక్వాయిపల్లి అని పిలిచినా గ్రామానికి అర్థాలు వస్తాయి. ఎక్కువపల్లె అంటే అన్నిటికీ ఎక్కువనే అని ఒక అర్థం, ఇది వరకున్న దానికన్నా ఎక్కువగా ఉన్న పల్లె అనే మరో అర్థం వస్తుంది. ఇక ఎక్‌వాయి అన్నప్పుడు ఒక నోరు అనీ, ఒక బావి ఉన్న ఊరు అనే అర్థాలు వస్తాయి. గ్రామ నామాలపై ఇంకా అధ్యయనం జరగవలసి ఉంది.

గ్రామాల్లో ఆనాడున్న చదువులు అంతంత మాత్రమే. ఓ అయ్యవారో, ఓ భట్రాజో వీధి అరుగుమీద పాఠాలు చెప్పేవారు శ్రీ వీరారెడ్డి చదువు ముదివెన్నులో అక్కడి నుండి ప్రారంభమైంది. అయితే అక్కల అత్తగారి ఇండ్ల సహకారం కొంత అందింది. హైదరాబాదులోనూ చదువు కొనసాగింది. బి.ఎ. డిగ్రీ పూర్తి చేశారు. ఎల్.ఎల్.బి. ఆ తర్వాత పూర్తి చేశారు.

ఒకవైపు వ్యవసాయం, మరోవైపు చదువులు ఈ విధంగా రెండింటిపై దృష్టి సారించి వారు వికాస పథంలో పయనించారు.

వివాహం - ఉద్యోగం

వారు మొదటగా కొన్ని చిన్న ఉద్యోగాలు చేశారు. 1974 డిసంబర్ 30వ తేదీన వారు మహబూబునగర్లో ఆర్.డి.ఓ. గా నియమితులయ్యారు. అప్పటికే చాలా సంవత్సరాల క్రితం వారి వివాహం శ్రీమతి అహల్యాదేవి గారితో జరిగింది.

శ్రీమతి అహల్యగారు ఇల్లు దిద్దుకోవడంలో, శ్రీ వీరారెడ్డిగారి ఎదుగుదలలో ఎంతో సహకరించారు. వివాహానికి పూర్వమే వారిలో దైవభక్తి నెలకొని ఉంది. శ్రీ వీరారెడ్డి నిజాం రాష్ట్రంలో చదివి, ఉద్యోగంలో చేరి రజాకర్ల దురంతాలను, కమ్యూనిష్టుల ఆగడాలను కళ్లారా చూశారు. వారి యౌవన కాలంలో అంటే దాదాపు 1947, 48 ప్రాంతాలలో హైదరాబాదు రాష్ట్రం అల్లకల్లోలానికి గురికావడం, రాజాబహదూర్, సురవరం తదితరులు తెలుగువారిలో చైతన్యాన్ని నింపే ప్రయత్నం చేయడం వారు పూర్తిగా అవగాహన చేసుకొన్నారు. కుటుంబ జీవనంలో సంస్కృతీ సంప్రదాయాలతోపాటు ధార్మిక భావ నిష్ఠ నిర్మాణం కావలసి ఉందని వారప్పుడే గుర్తించారు. ఆ కారణంగానే కుటుంబ జీవనంలో తమ సంతానానికి విద్యతోపాటు సంస్కారాలు అబ్బేట్టు చేయగలిగారు. వారు ఆర్.డి.వో గా ఉన్నతోద్యోగంలో 1974 లో ప్రవేశించి నప్పటి నుండి నిక్కచ్చిగా ఉన్న నికార్సయిన నైతిక విలువలు పాటించే ఆఫీసర్గా అందరి మన్ననలు అందుకొన్నారు.

వివిధ ఉద్యోగాలు - కర్తవ్య దీక్ష

దేశ రెవిన్యూ విధానం, తత్త్వం, భూముల సర్వే విధానం బాగా తెలిసిన శ్రీ వీరారెడ్డి మహబూబునగర్ ఆర్.డి.ఓగా ఒక సంవత్సరమే పనిచేసినా, ఆ కాలంలోనే వారెందరినో ఈ విషయంలో చైతన్యవంతులను చేశారు. రెవిన్యూ డిపార్టుమెంటులో ఉన్నతోద్యోగంలో ఉన్న శ్రీ కె.వి. భూపాలరావుతో వీరికి పరిచయమున్నది. శ్రీరావుగారు మహామంత్రి మాదన్నపై అధ్యయన పరిశోధనలు కొనసాగిస్తున్నారు. భూముల సర్వే విధానానికి ఒక శాస్త్రీయ పద్ధతిని అనుసరించిన మహామంత్రి మాదన్న భారత దేశంలోనే భూముల సర్వే పద్ధతికి ఆద్యుడై నిలిచాడు. అది కుతుబుషాహీ రాజుల్లో చివరి రాజైన తానీషా కాలంలో జరిగినా బ్రిటిషు వారికే మహామంత్రి మాదన్న సర్వే విధానం మార్గదర్శనం చేసింది. ఈ విషయాలన్నీ శ్రీ కె.వి. భూపాలరావుగారి ద్వారా శ్రీ వీరారెడ్డి తెలుసుకొన్నారు. సర్వే నెంబర్లు, శిస్తు, బంజర్, గైరాన్, నాలా, పహాడ్, జంగల్, తరి, ఖుష్కి, రకం, నీటిపన్ను, తాలాబ్, మాన్యం, పహాడ్... ఇలా ఎన్నింటి వివరాలో మాదన్న వల్లనే ప్రచారంలోకి వచ్చి రెవిన్యూ వ్యవస్థలో స్థిరపడ్డాయి. మాలీ పటేల్, పోలీసు పటేల్, పట్వారీలకు, వారి వ్రాయసగాంఢ్రకు జమాబందీ జరిగే సందర్భంగా - ఆయా తహసీళ్లలో వారు చెబుతూనే వచ్చారు. ముఖ్యంగా వారు మహబూబునగర్లో పనిచేసినప్పుడు మన్నెం కొండ దేవాలయం ధర్మకర్తలకు ఆలయ భూముల పరిరక్షణ విషయంలో హద్దుపద్దులు సూచించి అవగాహన కల్పించారు. అదేవిధంగా వీరన్న గుట్ట, దేవరకద్ర, కోడంగల్లు ఆలయాల భూముల విషయంలో కూడా స్థానికులను చైతన్యవంతులను చేశారు. ప్రభుత్వ సహాయాలు బీదాబిక్కికి అందే విషయంలో లోపం లేకుండా చూశారు.

ఆ తర్వాత 1975 జనవరి 17వ తేదీన శ్రీ వీరారెడ్డి నాగర్ కర్నూలు ఆర్.డి.వో. గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. వారు అక్కడ స్థిరపడి కార్యక్రమాలు చూచుకొంటున్న తరుణంలోనే రెండు నెలలకే 1975 మార్చి 18వ తేదీన శ్రీశైలం

ప్రాజెక్టుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమింపబడ్డారు. ఆ తర్వాత మరో పది పన్నెండు రోజులకే అంటే 1975 మార్చి 31వ తేదీన స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్‌గా బాధ్యతలు తీసుకోవడం జరిగింది.

ప్రభుత్వ పాలనారంగం అవసరాలను బట్టి శరవేగంగా ఎన్నో బాధ్యతలు నెత్తిపై పడ్డా, శిరోభారంగా భావించకుండా అన్ని పనులు అనుశాసనబద్ధంగా సక్రమంగా నిర్వహించి, ఉత్తమ ప్రభుత్వాధికారిగా, నైతిక విలువలు పాటించి, ప్రజా సంక్షేమాన్ని కోరే ఆఫీసర్‌గా శ్రీ రెడ్డి కీర్తి ప్రతిష్ఠ లార్జించారు.

1979 మార్చి 27వ తేదీన వారు మళ్లీ తూర్పు విభాగం ఆర్.డి.వో గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ బాధ్యతల్లో వారు కొన్ని మాసాలే ఉన్నారు. ల్యాండ్ రెవిన్యూ విధానంలో వారికున్న అనుభవ - విజ్ఞానం దృష్ట్యా 1980 ఆగష్టు 26వ తేదీన హైదరాబాదుకు పిలిపించుకోవడం జరిగింది. ల్యాండ్ రెవిన్యూ కమిషనరేట్‌లో అసిస్టెంట్ సెక్రటరీ హోదాలో పదవీబాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత కొద్ది రోజులకే చేవెళ్ల ఆర్.డి.వో గా వెళ్లి పోయారు.

ముక్కుకు సూటిగా వ్యవహరించడం, నీతి నిజాయితీలు పాటించడం కూడా వారి స్థాన భ్రంశానికి కారణాలుగా మారాయని అంటారు.

1981 ఫిబ్రవరి 28వ తేదీ నుండి 1983 ఫిబ్రవరి 23 వ తేదీ వరకు బంజారాహిల్స్ ల్యాండ్ ఎంక్వయిరీస్‌కు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేశారు.

విశిష్ట సేవా పత్రప్రదానం

తన విధి నిర్వహణలో ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా, ఒక అధికారిగా, క్రియాశీల కార్యకర్తగా కూడా కనిపించే శ్రీ వీరారెడ్డి ప్రభుత్వ పాలనా రంగానికి, ముఖ్యంగా రెవిన్యూ శాఖకు సంబంధించి కొన్ని సూచనలు చేస్తుండేవారు. ఆలోచనా శీలురెప్పుడూ భవిష్యత్తుకు మార్గదర్శనం చేస్తూనే ఉంటారు. పైగా వారు ప్రభుత్వ దృష్టిలో విశ్వసనీయ గౌరవ వ్యక్తిగా (హానెస్టీ) గుర్తింపబడ్డారు. వారి అనుశాసనాయుత

క్రమశిక్షణాయుత వ్యవహార సరళికి (సిన్సియారిటీకి) ప్రభుత్వం వారికి రాష్ట్రస్థాయి విశిష్ట సేవా పత్ర పురస్కారాన్ని ప్రదానం చేసింది. రెవిన్యూ డిపార్ట్‌మెంటులో మొట్టమొదటసారిగా వారీ పురస్కారాన్ని అందుకొన్నారు. పనిచేసే వారిని గుర్తించే ప్రభుత్వాలుంటే, ఆ ప్రోత్సాహంతో ఇంకా ఎందరో ఉత్తమ క్రియాశీల అధికారులు – ఉద్యోగులు నిర్మాణమయ్యే అవకాశముంటుంది.

న్యాయవాదిగా నడక

పదవీ విరమణకు ముందే కొందరు డీలా పడిపోతారు. మరికొందరు పదవీ విరమణానంతరం అంతా పోగొట్టుకొన్న వాళ్లలా తయారవుతారు. కాని శ్రీ శ్రీపతి వీరారెడ్డి పదవీ విరమణానంతరం బార్ ఆఫ్ హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో జాయినయ్యారు. నల్లకోటు ధరించి న్యాయస్థానంవైపు నడక సాగించినా వారి దృష్టి దేవాలయాల చుట్టే ఉండేది. ఆ కారణంగా దేవాలయ వ్యవహారాలే న్యాయశాస్త్ర పరంగా వారెక్కువగా చూశారు; సలహాలనిచ్చారు. భూములూ మడి మాన్యాలు అన్యాక్రాంతం కాకుండా దేవాలయ ధర్మకర్తల్ని చైతన్యవంతులనుగా చేశారు.

ఆశ్రమాలలో ఆధ్యాత్మిక వికాసం

పదవిలో ఉన్నప్పుడైనా, లేనప్పుడైనా వారి దృష్టి 'ధార్మికత – ఆధ్యాత్మికత' వైపే ఉండేది. ఆ కారణంగా పాలమూరు జిల్లాలోని షాదునగర్లో శ్రీ మలయాళస్వామి రామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యజ్ఞ ఆశ్రమ నిర్వహణలో భాగస్వాములయ్యారు. ఆ సంస్థకు ఉపాధ్యక్షులయ్యారు. శ్రీశ్రీశ్రీ నిత్య శుద్ధానందగిరి స్వామి ఆశ్రమాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శ్రీ సత్తినేని వేంకట రాజిరెడ్డి, శ్రీ శ్రీపతి గోపాల్ రెడ్డి, శ్రీ పసునూరి బ్రహ్మానందచారి తదితరులతో సమానంగా ఆశ్రమానికి శ్రీ శ్రీపతి వీరారెడ్డి తమ సేవలందించారు. ఆశ్రమ లావాదేవీల విషయంలో, శ్రీ రామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యోగ సమాచార్ ఆధ్యాత్మిక మాసపత్రిక రిజిస్ట్రేషన్ విషయంలో ఇంగ్లీషులో వ్యవహారానికి సంబంధించి ఉత్తర ప్రత్యుత్తరాలు – విజ్ఞప్తి

పత్రాలు వ్రాయడం పంపించడం లాంటి ఎన్నో పనులు వారు చేశారు. పత్రిక రిజిస్ట్రేషన్ సందర్భంగా పోస్టల్ నెంబర్ సంపాదించే సందర్భంగా కూడా వారు ఒకటి రెండు పర్యాయాలు ఢిల్లీ వరకు వెళ్లారు. ఇవన్నీ పూర్తి అయిన తర్వాతనే పత్రిక గాడిలో పడి ఈనాటి వరకు నిరాటంకంగా కొనసాగుతున్నది.

మహాత్ముల ప్రభావం

శ్రీ వీరారెడ్డి ఆధ్యాత్మికత వైపు మొగ్గడానికి కారణం అంతర్గతంగా వారిలో దాగి ఉన్న ఆత్మచింతనే. మహర్షి మలయాళ స్వామి, స్వామి చిన్మయానంద, సర్వేపల్లి రాధాకృష్ణ, మాతా మాణిక్యేశ్వరి, పరమ పూజనీయ శ్రీ గురూజీ తదితర ఆధ్యాత్మిక దివ్యమూర్తుల ప్రభావం వారిపై పడింది. వీరందరి రచనలతోపాటు వారు భగవాన్ రమణ మహర్షి, స్వామి శివానంద సరస్వతీ మహారాజ్ తదితరుల రచనలు చదివారు. వీరందరికీ మూలమైన ఆదిశంకరుల గ్రంథాల్ని వారు ఆంగ్లాంధ్ర భాషల్లో అధ్యయనం చేశారు. దివ్యజీవన సంఘం, విశ్వహిందూ పరిషత్, ఆర్యసమాజ్ తదితర సంస్థల కార్యక్రమాలలో వారు పాల్గొని, ఆయా సందర్భాలలో అవి నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సమావేశాల వ్యయాన్ని కూడా వారు భరించి నిర్వాహకులను ప్రోత్సహించారు. ఆయా సంస్థల ద్వారా ధర్మ ప్రచారానికి యువకులనూ ప్రేరేపించి ఆర్థికంగా సహాయం చేశారు. అనేక ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచురణకూ తోడ్పడ్డారు. ధార్మిక గ్రంథాలను పత్రికలను కొని అధ్యయనశీలురకు వితరణ చేశారు.

వీటన్నిటి వెనుక ఒకటే తపన. మనిషి కర్మయోగి కావాలి, జ్ఞానయోగి కావాలి, జీవితం భక్తి మార్గంలో నడవాలి. మానవీయ విలువలను నైతిక విలువలను ఈ సమాజంలో నెలకొల్పాలి. దేశభక్తి – దైవభక్తి – పాపభీతి ఈ మూడూ అందరిలో స్థిరంగా ఉండాలి. వారు ఈ దృక్పథంతో ఆలయాలను కూడా పునరుద్ధరించారు; నిర్మాణం చేయించి వాటి వికాసానికి తోడ్పడ్డారు.

ఆలయాల నిర్మాణం - పునరుద్ధరణం

శ్రీశైలంలో వారు పనిచేసినప్పుడు అక్కడి ఆలయాలకు సంబంధించి అధ్యయనం చేశారు. నీటిలో మునిగిన ఆలయాల పునరుద్ధరణకు మార్గదర్శనం చేశారు.

మలక్‌పేట మున్సిపల్ కాలనీలో ఆంజనేయ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ నిర్మాణంలోనూ, పునరుద్ధరణలోనూ ఎందరినో ఇన్వాల్వ్ చేశారు. తమ బంధువులైన ఎన్.ఆర్.ఐలతో ఆలయ వికాసానికి సహకరించేట్టు చేశారు. పూజాదులతో ట్రస్టీలతో సంప్రదించి ఆధ్యాత్మిక పౌరాణికాది కార్యక్రమాలు కొనసాగేట్టు చేశారు. తాము ప్రత్యేకంగా ఎన్నుకొన్న విశిష్ట ఆధ్యాత్మిక వేత్తల చేత ఉపన్యాసాలిప్పించి తాము వారిని సత్కరించారు.

తమ గ్రామంలోని ఆలయానికి స్థలం తక్కువగా ఉండడం, ఆలయం శిథిలం కావడం చూచి, తమ రెండు భవంతుల స్థలాన్ని ఆలయానికి దానం చేశారు. దానికి ఒక కమిటి ఏర్పాటు చేసి పునర్నిర్మాణానికి బాటలు వేశారు.

వారి దేవాలయ నిర్మాణ పునరుద్ధరణాది కార్యక్రమాలకు సాక్షీభూతంగా నిలిచింది అయ్యసాగర క్షేత్రం. అక్కడి మూలవిరాట్టు వీరభద్రుడు. ఇదొక త్రికూట పర్వతం. కొండలకు అటువైపున మహాకాళి; ఆ తల్లి మైసమ్మ దేవతగా ఆ స్థలం మైసిగండిగా ప్రసిద్ధమైంది. ఆదిశక్తి వెలసిన ఆ స్థల మాహాత్మ్యం పెరుగుతున్నది. ఈ వీరభద్ర ఆలయం వికసించాల్సి ఉంది. శ్రీ బట్టు నర్సిరెడ్డి (కొల్కులపల్లి) గారి సహకారంతో, శ్రీ వీరారెడ్డి గారి అధ్యక్షతన ఏర్పడ్డ ధర్మకర్తల సంఘం అయ్యసాగరంలో వీరభద్ర ఆలయాన్ని పునరుద్ధరించింది. శ్రీశ్రీశ్రీ భ్రమరాంబికా త్రిపురాంతకేశ్వర ఆలయం నిర్మించింది. వీరభద్రుని సమీపంలోనే కాళికాదేవి వెలసింది. సరస్వతీ అమ్మవారు సాక్షాత్కరించింది. యజ్ఞాలకు వ్రతాలకు వేదికగా అపూర్వ మంటప నిర్మాణం జరిగింది. దివ్యమైన గరుడస్తంభం నెలకొల్పబడింది. అంతేగాక వీటన్నిటితో పాటు మలయాళ స్వామి శివకోటి జపయజ్ఞ ఆశ్రమమూ వెలసింది. ఆ ఆశ్రమం ముందు

వైపు సీతారామాంజనేయ ఆలయం నిర్మింపబడింది. అయ్యసాగరం దివ్యదేవతల త్రికూటంగా, ఆధ్యాత్మిక జ్ఞానభిక్ష పెట్టే ఆర్యసాగరంగా దినదినాభివృద్ధి చెందుతుంది. ధ్యానమందిరం, వసతి నిలయాలు కూడా నిర్మింపబడ్డాయి. పచ్చని అడవి, లోతైన లోయ, ఆకాశాన్ని తాకే కొండలు, ఎక్కువ పల్లి దగ్గరి చరికొండల వరస ఇంతవరకు సాగి, దర్మదాత శ్రీశ్రీపతి వీరారెడ్డి దాతృత్వం తన సొంతభూమి కొన్ని ఎకరాలు ఈ ఆలయాల నిర్మాణోద్ధరణలకు సమర్పింపబడింది.

శ్రీ వీరారెడ్డి ఇది ఏదో దానంగా భావించలేదు. ఆ దేవుడిచ్చింది దేవునికే ఇచ్చాము అనుకొన్నారు. ట్రస్టు బోర్డులోని అందరూ కార్యకర్తలు శ్రమించవచ్చుగాక ! శ్రీ నర్సిరెడ్డి తదితరులు అపూర్వంగా పనిచేయవచ్చు గాక! కాని అందరికీ స్ఫూర్తి ప్రదాత ధర్మదాత శ్రీ శ్రీపతి వీరారెడ్డి గారు.

ఇది ఆధ్యాత్మిక కేంద్రంగా, హిందూ ధర్మ శ్రద్ధా కేంద్రంగా, యోగ కేంద్రంగా వికసింప జేసికొని ఈ జాతి లాభాలు పొందాలి; దివ్యమానవ నిర్మాణానికి ఇది కేంద్రం కావాలి, ఇదీ శ్రీ వీరారెడ్డిగారి అంతిమ ఆకాంక్ష. ఈ ఆకాంక్ష పరిపూర్తికి మనం రామబంటులం కావాలి మరి.

గుడేకాదు బడి కూడా !

ఈ దేశ ధార్మిక సంస్కృతుల వికాసానికి దోహదం చేసే వాటిలో ప్రప్రథమంగా మనం చెప్పుకోవలసింది అమ్మ ఒడి. అమ్మ ఒడి మనకు సంస్కారాలందించాలి. ప్రార్థన చేయనేర్పాలి; బొట్టు దిద్ద నేర్పాలి; తారంగం (భజన) నేర్పించాలి. అందరు కలిసి పారాయణం చేసే పద్ధతి నేర్పాలి. ఇవన్నిటికీ దూరమై, కేవల పాశ్చాత్య సంస్కృతి ప్రభావంలో పడిపోకుండా పునాది వేసేది అమ్మ ఒడే అని గుర్తించాలి. ఇక తర్వాతిది మన వ్యవసాయపు మడి. పాశ్చాత్య దేశాల డంకెల్-బీటి విధానాలతో ఇవాళ మన మడి గిలగిల కొట్టుకొంటున్నది. ఆధునిక వ్యావసాయిక శాస్త్రీయ విజ్ఞానాని కనుగుణంగా మన దేశీ వ్యవసాయాన్ని సరిదిద్ది, మన మడిని ప్రపంచానికే

అన్నం పెట్టే దివ్యక్షేత్రంగా మార్చుకోవలసి ఉంది. ఇంతకు పూర్వమే మనం గుడి గురించి చెప్పుకొన్నాం. ఇప్పుడు మనం తీర్చిదిద్దుకోవాల్సింది మన బడి. పిల్లలందరికీ సామాజిక సంస్కార కేంద్రం బడి.

అటువంటి బడిపై శ్రీ వీరారెడ్డి దృష్టి ప్రసరించింది. అది ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయికి ఎదుగవలసి ఉంది. ఎక్కువపల్లి పాఠశాల ఎదుగుదల నిమిత్తం, వారు శ్రీ శ్రీపతి గోపాల్‌రెడ్డి గారి సహకారంతో మండల జిల్లా స్థాయి అధికారులను కలిశారు. సమితి ప్రెసిడెంట్లను, జిల్లా పరిషత్తు చైర్మన్లనూ రప్పించారు. విద్యార్థుల చేత ప్రదర్శన లిప్పించారు. ప్రజల చేత మహాజర్లు ఇప్పించారు. ఇంకేం పల్లెటూరులో పరిషదున్నత పాఠశాల వెలసింది.

బడి గోడలూ – పిల్లలూ ఉన్నంత మాత్రంలో సంస్కారాలు అబ్బవు. సంస్కారాలకు, పాఠశాలకో ప్రణాళిక ఉండాలి. అందుకొరకు విద్యార్థులు, తల్లిదండ్రులు, పోషకులు, పాఠశాల కార్యనిర్వాహక సంఘం, అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయుడు అందరూ కలసికట్టుగా పూనుకోవాలి. జ్ఞానశీల సంస్కారాల నిమిత్తం తపస్సు చేయాలి. అందుకు ప్రాతిపదికగా పాఠశాలలో శ్లోకాలు, సుభాషితాలు, స్తోత్రాలు, ప్రార్థనలు చెప్పే పద్ధతి ప్రవేశ పెట్టించారు. ఇందుకొఅకు తామే స్వయంగా పూనుకొన్నారు. సదాచారాలు చెప్పించారు; యోగాసనాలు వేయించారు. అధ్యాపకులకే మార్గదర్శనం చేశారు. పరీక్షల్లో ప్రథమ స్థానాల్లో వచ్చిన వారికి, క్రీడా గాన సంగీత నటనా ప్రదర్శనల్లో విశేష ప్రతిభ కనబరచిన వారికి ప్రోత్సాహకాలందించారు; బహుమతులిచ్చారు; ఉపకార వేతనాలిచ్చారు.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అన్న రామయ్య తండ్రి మాటకు దీటుగా ఉన్న ఊరే కన్నతల్లి అని భావించారు. ఎక్కువపల్లె అనే మల్లె తీగకు ఎరువులు వేశారు; నీళ్లు పోశారు; పసందైన పరిమళాల పూలు పూయించారు.

సామాజిక న్యాయమూర్తి

ఆయన ఆశించిన అమ్మఒడి సంస్కారాలందిస్తే, వ్యవసాయం మడిలో రెండు వందల పైచిలుకు గోవులు నిలచి పాల పుంతలనే నిర్మించేట్టుగా చేశారు. తన తర్వాత వాటిని చూసే వారుంటే సరి, లేకపోతే వాటిని గో శాలలకే ఇవ్వాలని సంకల్పించారు.

అవును గోవు మాలచ్చిమి ఈ దేశ ధర్మ సంస్కృతులకు ప్రతీక. గో అంటే వేదమని, భూమి అనీ, కిరణమనీ, జ్ఞానమనీ అర్థాలున్నాయి. ఇవన్నీ వికసించాలనే ఆ గో సంస్కృతి ద్వారా ఈ దేశం ఆర్థికంగా సుసంపన్నం కావాలని ఆశించారు.

గోవుపాలు, పెరుగు, వెన్న, నేయి, పంచకం, పేడ అన్నీ దివ్యమైనవే. నిజానికి గోవు ఒక సజీవ ఔషధం మొక్క (లివింగ్ మెడిసినల్ ప్లాంట్) గోవుకు సంబంధించి, గోవు ద్రవ్యాలకు సంబంధించి జరుగుతున్న పరిశోధనలు వారు తెలుసుకొన్నారు. ఆ సాహిత్యమూ సంపాదించారు. ఈ గో సంపద అందరికీ అందాలన్న సామాజిక న్యాయాన్ని వారు ప్రచారం చేశారు. గోహింసను వ్యతిరేకించారు. నీళ్లున్నాయి; భూములున్నాయి; పంట పండే పొలాలున్నాయి. కాని వ్యవసాయం ముందు ముందు కొనసాగించే మానవశక్తే కొరవడుతున్నది... ఇదీ వారి వేదన. భూమి పంపిణీ పేరిట తమ రాజకీయ గమ్యం చేరడానికి కొన్ని శక్తులు హింసాత్మక ధోరణులను అవలంబిస్తున్నాయి. ప్రజల్లో కల్లోలం సృష్టిస్తున్నాయి. పచ్చని పల్లెల్లో చిచ్చు పెడుతున్నాయి. ఉన్న వారు (హ్యావ్స్) లేనివారు (హ్యావ్ నాట్స్) అనే పేరుతో వర్గవాద సిద్ధాంతాన్ని పరిపోషించి ద్వేషాగ్నిజ్వాలల్ని సృష్టిస్తున్నాయి. భూములు బీళ్లయిపోతున్నాయి. మానవ సంబంధాలు చెదరిపోతున్నాయి.

ఈ పరిస్థితుల్లో ఒకనాటి రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు శ్రీ వీరారెడ్డి ఇంటికి వచ్చారు. మీ భూమిలో కొంత ఇవ్వండి పేదలకు పంచాలన్నారు. అలనాడు భూదానోద్యమాన్ని నిర్వహించి శ్రీ వినోబా పంచి పెట్టిన విధంగా నేనే భూమిలేని

నిరుపేదలకు పంచుదామనుకొన్నాను అన్నారు శ్రీ వీరారెడ్డి. ఆ వచ్చినవారు అవాక్కయ్యారు.

ఇన్ని ఎకరాలు పంచాలన్నారు; అంతకన్నా రెండు ఎకరాలు ఎక్కువే పంచుతామన్నారు. వారు పైకి ఏమన్నా మీలాంటి ధర్మదాతలు ఈ లోకంలో ఉండాలనుకొంటూ వెళ్ళిపోయారు. శ్రీ వీరారెడ్డిగారు తాననుకొన్న విధంగా ఆ భూమిని నిరుపేదలకిచ్చి సామాజిక న్యాయమూర్తిగా కీర్తిగడించారు. అంబేద్కర్ ఆశించిన సామాజిక న్యాయవాదానికి ప్రతీకగా నిలిచారు.

ఎవరో అడిగితే, ఎవరో చెబితే కాకుండా తమంతకు తాముగా వారు సమాజానికి తమ గ్రామానికి ఉపయోగపడ్డారు. విద్యాలయం వారికి, ఊరి వారికందరికి గ్రంథాలయ సౌకర్యం కల్పించారు. అంతేగాక కర్షకులను దృష్టిలో పెట్టుకొని శ్రీపతి కర్షక భవన్‌ను నిర్మించారు.

2000 సం॥ జనవరి నెలలో జన్మభూమి కార్యక్రమంలో లోకల్ కంట్రిబ్యూషన్ క్రింద వారు తమ వ్యక్తిగత విరాళం క్రింద లక్ష రూ॥లు అందజేశారు. సామాజిక వికాస కేంద్రాలకు వారు భూదానం చేశారు. అందులో ఆరోగ్య ఉప కేంద్రం కూడా రావాలని ఆశించారు. కమ్యూనిటీ హాలు, మహిళా మండలి నిర్మాణం కావాలనీ, గ్రామం ఒక ఆదర్శవంతంగా నిలవాలని వారు ఎక్కువ పల్లికి అపూర్వ సేవలందించారు. అలనాటి ధర్మవారధి నిర్మాణంలో ఉడత తన శక్తి మేరకు సేవ చేసింది. ధర్మదాత మహాదాత శ్రీ శ్రీపతివీరారెడ్డి గారు ఆ ఉడతకు ఆదర్శంగా నిలిచారు. గ్రామానికి తమ శక్తికి మించి సేవలందించారు.

జ్ఞానానికి అక్షరాకృతి

అలా ఒక నిష్కామ కర్మయోగిగా నిలిచి పోయారు శ్రీ వీరారెడ్డి. వారి జీవితాదర్శం ఇచ్చే స్ఫూర్తి అపూర్వమైంది.

అయితే వారిలోని ఈ ధార్మిక ప్రవృత్తిని తట్టిలేపిన ఒక వ్యక్తి ఉన్నారు; ఆయన వ్యక్తిత్వమూ మనమిక్కడ చెప్పుకోక తప్పదు. ఆయనెవరో కాదు ఖుదాబక్ష్ పల్లి శ్రీ పాశం నారాయణరెడ్డి, శ్రీ వీరారెడ్డి పెద్దక్క శ్రీమతి మోహనమ్మగారి భర్త.

ఆయన ఒక ఉత్తమ కర్షకుడు; ఉత్తమ స్వాతంత్ర్య సమరయోధుడు; జ్ఞాన యోగంలో తల పండిన వాడు. అగ్నిహోత్రి అయిన శాకాహారి, అసంగానంద, దివ్య మాణిక్యేశ్వరీ మాత భక్తుడు; గుట్టల మీద సీతాఫలాల విత్తనాలు చల్లి చల్లించి సామాన్యునికి ఆహారాన్ని అందించిన ఫలదాత.

ఆయన త్యాగమూర్తులు, సాధు మూర్తులు, బంగ్లాదేశ్ బుఱ్ఱకథ, దయానంద సరస్వతీ జీవిత చరిత్ర బుఱ్ఱకథ, సత్రాజితీయము వీధి నాటకము, సదాశివరెడ్డి పద్య కావ్యం, భారతదేశ చరిత్ర (బ్రతుకమ్మపాట) తదితర గ్రంథాలు రచించిన ఉత్తమకవి. తన కూతుళ్ల చేత కూడా హోమాలు - యజ్ఞాలు చేయించిన అతి సనాతన వేద సిద్ధాంతాన్ని నమ్మిన అభ్యుదయ వాది.

మరి ఇటువంటి దివ్యమూర్తి ప్రభావం - అందులో ఇంత మంచి బావగారి ప్రభావం పడకుండా ఎలా ఉంటుంది? అటువంటి బావగారు 1982 ఫిబ్రవరి 27వ తేదీన పరమపదించారు. వారి వ్యక్తిత్వాన్ని, జీవిత సాహిత్యాల్ని మేళవించి ఓ జీవిత చరిత్ర వ్రాయించాలని సంకల్పించారు. శ్రీ నారాయణ రెడ్డిగారి చిన్నల్లుడు శ్రీకాకులవరం శేఖర రెడ్డి, పెద్దకూతురు ఇందిరమ్మలకు ఇదే సంకల్పముంది. ఈ ముగ్గురి కోరిక మీద ఆచార్య కసిరెడ్డి 2003 లో **పరమ కర్మయోగి పాశం నారాయణరెడ్డి** అనేగ్రంథాన్ని (80 పుటలు) రచించారు. శ్రీమతి ఇందిరగారి కుమారుడు ప్రదీప్ వివాహ సందర్భంగా ఈ గ్రంథం ఆవిష్కరింపబడింది. తన గురువు లాంటి తన బావగారి జీవిత చరిత్ర అలా అక్షరాకృతి ధరించి నందుకు వారు పొందిన ఆనందానుభూతులకు కొలమానాలు లేవు.

మరొక గ్రంథం - అది వీరభద్రీశ్వరీయం. అయ్యసాగరంలోని వీరభద్రుని దివ్యచరిత్ర పదిమందికి తెలియాలి. ఆ దివ్య పౌరాణిక చరిత్రతోపాటు ఏ చారిత్రక

విభాగ సంధ్యల్లో అది ఆవిర్భవించిందో తెలియాలి. దానికి ప్రమాణాలు సంపాదించి వ్రాసేవారు కావాలి. ఇది కూడా వారు ఆచార్య కసిరెడ్డి చేతనే వ్రాయించారు. దీనివల్ల అయ్యసాగర క్షేత్ర ప్రాశస్త్యం పదిమందికి తెలియాలన్న వారి కోరిక నెరవేరింది. వారు దివ్య సంకల్పులు. వీరభద్రీశ్వరీయం వారనుకొన్నట్లే 2003 ఫిబ్రవరిలో అచ్చయ్యింది. అదిప్పుడు కొత్తగా వచ్చిన ఆలయాల విశేషాలతో పునర్ముద్రణ కావలసి ఉంది.

ఇంకొక గ్రంథం సద్గురు సాహితి ఒక శివరాత్రి సందర్భంగా ఏదైనా గురు ప్రాశస్త్యాన్ని తెలిపే గ్రంథం ప్రచురించి ఆవిష్కరిద్దామన్నారు శ్రీ శ్రీపతి వీరారెడ్డి. అంతే వ్యాస శంకరాది గురువుల మీద ఆచార్య కసిరెడ్డి రచించిన వ్యాసాలు సద్గురు సాహితి పేరిట 2004 ఫిబ్రవరిలో అచ్చయ్యాయి. ఈ గ్రంథం వారు శ్రీ వీరారెడ్డి దంపతులకు అంకితమిచ్చారు. (ఆ అంకిత పద్యాలు ఈ పుస్తకం చివరలో ఇవ్వడం జరిగింది.)

ఇలా వారింకా ఎన్ని గ్రంథాలు వ్రాయించి ప్రచురించి జ్ఞానానికి అక్షరాకృతి కల్పించారో రికార్డు చేయవలసి ఉంది. అంతేగాక వారప్పుడప్పుడు తామనుకొన్న ఆలోచనలకు అక్షర రూపమిచ్చారు. అవి రెండు మూడు వ్యాసాలుగా తయారై, సాధునగర్ ఆశ్రమం ప్రచురించిన కొన్ని ప్రత్యేక సంచికలలో అచ్చయ్యాయి.

అంతేగాక 1989 లో వారు అమెరికా వెళ్లినప్పుడు కొన్ని శ్లోకాలు – స్తోత్రాలు ఇంగ్లీషులోకి లిప్యంతరీకరణం చేసి అక్కడి హిందూ గృహస్థులకు పంచి పెట్టారు. ఉదయమే దేవుని ముందు కూచున్నప్పుడు ఆ స్తోత్ర శ్లోకాలు ఇవాళ వేలాది హిందూ కుటుంబాలు పారాయణం చేస్తున్నాయి. జ్ఞానం అక్షరాకృతి ధరిస్తే కలిగే ప్రయోజనమే ఇది.

జ్ఞానమే కాదు పశుసేవ కూడా

మూగజీవాల నుండి మానవుడు సేవలందుకొంటాడు. ఆ సేవలకు ప్రతిఫలంగా వాటికింత గడ్డి వేస్తాడు; దాణా వేస్తాడు. వాటికి వచ్చే రోగాలకూ, కలిగే కష్టాలకు

నివారణోపాయం తెలియక తలబాదుకొంటాడు. అందుకే పాడీ పంటా – పశువూ ఉన్నచోట ఓ పశు వైద్య శాల ఉండాలంటారు. పూర్వం పశువులను బట్టే ఒకరి సంపద నిర్ణయించేవారు.

అటువంటి ప్రాధాన్యమున్న పశువులకు తమ గ్రామంలో పశువైద్యశాల ఏర్పాటు చేయించారు. ఊరివారి సహకారమెంత ఉన్నా ప్రభుత్వ పాలనా రంగంతో పైరవీల పని మామూలు విషయం కాదు. నిజంగా ఆ పల్లెటూరికి పశు వైద్యశాల – భవనం రావడం చిత్రాతిచిత్రం. కాని అసాధ్యాల్ని సుసాధ్యం చేసే మెస్మరిజం వారి చేతిలో ఉంది. పశువైద్యశాల – భవనం వచ్చింది. దాని నిర్మాణంలోనూ వారి యోగదానం ఉంది. ప్రజలు సంతసించారు; పశువులు సంతసించాయి; అన్నిటిని మించి పశుపతి సంతసించాడు.

అలుపెరుగని ఆధ్యాత్మిక పథకుడు

శ్రీరామకోటి జపయజ్ఞాలు, శివకోటి జపయజ్ఞాలు, శివరామకోటి జపయజ్ఞాలు, వ్యాసాశ్రమం వారి సనాతన వేదాంత సభలు, అఖిలాంధ్ర సాధు పరిషత్ సమావేశాలు, సుందర చైతన్యానంద జ్ఞాన యజ్ఞాలు, గణపతి సచ్చిదానంద స్వామి సభలు, తిరుపతిలో బ్రహ్మోత్సవాలు, భద్రాద్రిలో శ్రీరామనవమి సందర్భంగా కల్యాణాలు, గణపతి ఉత్సవాలు, శరన్నవరాత్రి ఉత్సవాలు వీటన్నిటితో పాటు 15వ ఆగష్టు 26 జనవరి జాతీయ పర్వదినాలు, గీతాజయంతి ఉత్సవాలు, గాంధీజయంతులు, ఆయా ఆలయాల ఉత్సవాలు.... ఒక్కటేమిటి శ్రీ శ్రీపతి వీరారెడ్డి గారు ఎన్నిటికి వెళ్లారో, ఎన్నిటికి సహకరించారో చెప్పలేం! ఇవాళ ఇక్కడ, రేపు అక్కడ, ఎల్లుండి ఎక్కడో! అందరి కళ్లల్లో ఆ పరమాత్ముని దివ్యకాంతులు సందర్శించాలన్న తపన.

ఆరేడేళ్ల క్రితం కొత్తూరులో శ్రీరామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యజ్ఞం జరుగుతున్నది. వెళదామనుకొంటే కారూ లేదూ, డ్రైవరు లేడు. నేను వెళుతున్నాను; ఉపన్యాస సమయాని కందుకోవాలి అన్నారొకరు. దేని మీద వెళుతున్నారు అడిగారు వారు. సైకిల్ మోటార్ మీద అన్నాడాయన. పదండి నేనూ మీ వెంబడి వస్తాను

అన్నారు శ్రీ వీరారెడ్డి. ఈ సైకిల్ మోటార్ మీద వెనుక కూర్చుంటారా ఆశ్చర్యంతో ప్రశ్నించాడాయన. అవును, ధర్మ కార్యానికి నడిచే పోవాలి కాని అంత దూరం నడవ లేం కదా! దేవుని దగ్గరికి ఎలా వెళ్లాలి అని ఆలోచించనే కూడదు అన్నారాయన. దట్ ఈజ్ వీరారెడ్డి. అలా ఆ సైకిల్ మోటర్ మీద వారూ వీరూ కలిసి అయిదారుసార్లు ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెళ్ళి ఉంటారు.

ఒక కలక్టరు స్థాయి వ్యక్తి, అనుకొంటే అప్పటికప్పుడు కారు కట్టుకొని ఎక్కడికైనా వెళ్లే పరపతి, శక్తీ ఉన్న వ్యక్తి బస్సులో జీపులో సైకిల్ మోటర్ మీద ఎన్నిసార్లు పయనించారో! అదీ వారి ఆధ్యాత్మిక శక్తి ! అదీ వారి నిరాడంబర మూర్తిమత్వం ఆర్తి !

సానందాభ్యుదయం గృహం

ఒక పురుషుని అన్ని విజయాల వెనుక తల్లో, భార్యో, అక్కో, చెల్లెలో ఉంటుందంటారు. వీరారెడ్డిగారికి అక్కాచెల్లెంద్రపై భక్తీ అనురాగాలున్నాయి. వారు వారి వారి కుటుంబాలు తీర్చిదిద్దుకొన్న తీరుకు ఆనందమే ఉంది. ఎక్కడన్నా పూలూ - ముళ్లూ ఉన్నా కంటకావృత మార్గాన్ని నిష్కంటకం చేసుకొనే నైపుణ్యం అందరికీ ఉంది.

నిరంతరం శ్రీమద్భగవద్గీత, శివగీత, విష్ణు సహస్రనామ పారాయణాలు చేసే వారి ధర్మపత్ని శ్రీమతి అహల్యాదేవి అండదండలు వారికి నిండుగా దండిగా ఉన్నాయి. శ్రీ రెడ్డి గారితోపాటు వారు కూడా అనేక ఆధ్యాత్మిక సదస్సులలోని సామూహిక పారాయణాల్లో పాల్గొన్నారు.

తమ ముగ్గురు పుత్రికలు డా॥ ఉమ, శ్రీమతి నిర్మల, శ్రీమతి రమ, ఇద్దరు కొడుకులు డా॥ కరుణాకర్‌రెడ్డి, శ్రీనారాయణరెడ్డి, తదితర మనుమలూ, మనుమరాంద్రకు కూడా తామాశించిన సంస్కారాలు నాటడంలో వారు సఫలీకృతులయ్యారు.

ఆ కాలంలో ఆడపిల్లల్ని నగరాలకు పంపించి చదివించడానికి వెనుక ముందాడుతున్న తరుణంలో మాకందరికీ మేమాశించిన విద్యలు నేర్పించడంలో, మా నాన్నగారు వెనుక ముందాడలేదు అంటారు డా॥ ఉమ, శ్రీమతి నిర్మల, శ్రీమతి రమలు.

ఆయన నడవలేని చివరి స్థితిలో కూడా ఆ దేవుని దగ్గరికి వెళ్లాలి; ఆ స్వామీజీతో మాట్లాడాలి, ఫలానా వారికీ పనిచెప్పి చేయించాలి, అనుకొన్న ఆ ఆలయం పనులు అట్లాగే ఆగిపోయాయి. అవి పూర్తి చేయించాలి అని పడుతున్న తపన చూచి - ఏమిటీ జీవుని వేదన అని కొడుకులు ఎంతో ఆవేదనకు గురయ్యారు.

సమాజసేవా కార్యక్రమాలు ఎంత దీక్షతో చేశారో ఉద్యోగ బాధ్యతలు ఎంత అను శాసన బద్ధంగా నిర్వర్తించారో, మా చదువులంత పట్టుదలగా కొనసాగించడానికి మా నాన్నగారు మమ్మల్ని నిరంతరం ప్రోత్సహించారు అంటారు వారి కూతుళ్లు, కొడుకులు కరుణాకర్, నారాయణలు. ఆస్తిపాస్తులుంటాయి పోతాయి కాని మానాన్న మాకు విద్యాధనం ప్రసాదించారు అంటారు వారు. తమ తండ్రిని గూర్చి వారెంతగా ధార్మిక విషయాలలో శ్రద్ధాళువురో, అంతగా స్త్రీ విద్యా విషయంలో చైతన్య శీలురు అంటారు వారు.

తమ సంతానం అల్లుండ్రు, కోడండ్రు అందరూ విద్యా వినయ సంస్కార భూషితులనీ, ఇప్పుడు వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడి మాకే ఏదో సహాయం చేయాలనుకొంటున్నారని, వారు ఎదిగి ఈ సమాజంలో వెలగాలనే తనకోరిక అని ఒకటి రెండు పర్యాయాలు ప్రాస్తావికంగా వారన్నారు.

అవును మరి :-

పుత్రోత్సాహము తండ్రికి
పుత్రులు జన్మించినపుడు పుట్టదు, జనులా
పుత్రులకనుగొని పొగడగ
పుత్రోత్సాహంబునాడు పుట్టుర సుమతీ !

ధర్మదాత శ్రీపతి వీరారెడ్డి పూర్ణకాములూ, పూర్ణ సిద్ధులు. జీవితంలో ఇంకేం కావాలి మరి !

చివరి రోజుల్లోనూ చిత్కళలే !

వారు మరో నెలరోజులకు పరమపదిస్తారనగా రాత్రి కలలో వీరభద్రుడు కనిపించి నన్ను అక్కడికి రావద్దన్నారు అన్నారు అందరితో. అప్పటికే వారి అనారోగ్య దృష్ట్యా కొడుకులూ – కూతుళ్లు వచ్చి ఉన్నారు.

ఆపరేషనయ్యింది; అనారోగ్యంతో ఉన్నారు. అయినా వింటున్నారు; అనుకొన్నది చెబుతున్నారు. వీరభద్రుడేమో తన దగ్గరికి రావద్దన్నాడు; తన కేమో వెళ్లాలనుంది. ఆ విషయమే చెప్పారు.

ఇంకేం మరుసటి రోజు పరివారంతో బయలుదేరారు. బయలు దేరడానికి కొన్ని గంటల ముందు ఫలానా వారు రామాయణం మీద ప్రసంగిస్తే వినాలని ఉంది అన్నారు. ఆ ఏర్పాటుకూడా పూర్తయింది.

ఆ రోజు మధ్యాహ్నం 11, 12 గంటల ప్రాంతం; భ్రమరాంబికా త్రిపురాంతకేశ్వర ఆలయమంటపంలో ఆచార్య కసిరెడ్డి సుందరకాండ – ఆంజనేయుని తత్త్వంపై, శ్రీ మావుడూరు సూర్యనారాయణమూర్తి రామాయణం తత్త్వసారం అనే అంశంపై ప్రసంగించారు. వారిరువురిని శ్రీ వీరారెడ్డి ఘనంగా సత్కరించారు.

రావద్దన్న వీరభద్రుణ్ణి తలచుకొంటూనే అన్నీ దర్శించుకొన్నారు. పాపం వీరారెడ్డిగారు ఆ దైవం మాట వెనుక ఉన్న పరమార్థం గ్రహించలేక పోయారనుకొన్నారు కొందరు. అయినా వారితో ఈ విషయం ప్రస్తావించడం భావ్యం కాదనుకొన్నారు.

ఇప్పుడే త్వరపడి నా దగ్గరకు రావద్దు.

ఈ భూమ్మీద మీరింకా ఎన్నో పనులు చేసేదున్నది.

– అని ఆ పరమాత్ముని కోరిక.

వీరికేమో ఆయనను చూడాలని తపన.

జీవుని కోరిక దేవుడు తీర్చకుండా ఎట్లుంటాడు. 26వ వేదాంత విజ్ఞాన మహాసభలలో పాల్గొనాలని వారి తపన. ఆ సభలు 2006 డిసంబర్ 5, 6, 7, 8 తేదీలలో పాలమూరు జిల్లాలోని ఆమనగల్లు మండల కేంద్రంలో జరుగుతున్నాయి. శ్రీ వీరారెడ్డి ఆరోగ్యం బాగుంటే సభలకు ముందూ వెనుకా ఎన్నో ఏర్పాట్లలో ఆయనే ఉండేవారు.

కనీసం చూద్దామని వారి కోరిక. మళ్లీ ఈ సభలను ఇక చూడలేనన్న వేదన.

2006 డిసంబరు 5వ తేదీన ఉ|| 12 గంటల ప్రాంతంలో కొడుకులు డా|| కరుణాకర్, శ్రీనారాయణ, కూతుళ్లు అందరూ వెంటరాగా చక్రాల కుర్చీలో సభా వేదికపైకి వచ్చారు. సాధునగర్ ఆశ్రమాధిపతి శ్రీశ్రీశ్రీ నిత్య శుద్ధానందగిరి స్వామి వారి సేవలను గూర్చి ప్రశంసించి, ఆశీర్వదించారు; ఆ తర్వాత వారిని శాలువాతో సత్కరించారు.

శ్రీ వీరారెడ్డి గారు మాటాడలేదు. తన కుడిచేతి పైకెత్తి అభయముద్ర పట్టారు. ఆ భగవంతుణ్ణి నమ్ముకోండి! అందరికీ ఆయనే అభయప్రదాత అన్నట్టుగా ఉంది ఆ దృశ్యం; దివ్య దృశ్యం.

అందరి కళ్ళు చెమ్మగిల్లాయి; ఎందరి గొంతులో మూగవోయాయి.

అయినా సభాధ్యక్ష స్థానంలో ఉన్న ఆచార్య కసిరెడ్డి వారి ధార్మిక సేవలను వ్యాఖ్యానిస్తూనే ఉన్నారు. వారిని తీసికొని వారి పరివారం భాగ్యనగర్ వైపుగా పయనించింది.

అశ్రునయనాలతో అంతిమవీడ్కోలు :

ఆ తర్వాత శ్రీశ్రీపతి వీరారెడ్డి గారు మరో 21 రోజులు ఆ దేవదేవుని పిలుపు కొఱకే వేచి ఉన్నానన్నట్లున్నారు. చివరి రెండు మూడు రోజుల వరకు ఏదో మాటాడుతూనే ఉన్నారు. అన్నీ దివ్య వాక్కులే; దేవుని స్మరణలే.

చివరికి 2006 డిసంబర్ 27వ తేది సాయంకాలం 5 గంటల 20 ని.లకు వారు ఆ పరమేశ్వరునిలో ఐక్యమయ్యారు. అది వ్యయ నామ సం॥ర మార్గశిర శుద్ధ సప్తమి. భగవంతుడిచ్చిన ప్రతిదినం ప్రతిక్షణం గొప్పదే. ఆ గొప్ప క్షణాల అమృత కణాలు అమృతమయుడైన పరమాత్మునిలో కలిసిపోయాయి. అంతా అమృతమయం ఆనందమయం అని నిరూపితమయింది.

ఆ మరుసటి రోజు ఎక్కువ పల్లిలో వేలాది మంది ప్రజల అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు జరిగింది. అంత్యేష్టిలో పిల్లా పాప అందరూ పాల్గొన్నారు.

ఊరు ఊరే కదలి భజనలతో సాగనంపింది. కోసిన వరిచేల పొలాల్లో చితి భగభగమండుతోంది. దూరాన గోవులు మూగగా రోదిస్తున్నాయి. తాటి చెట్లు మేము సాక్ష్యమంటూ తతలూపుతున్నాయి. దూరాన ఎత్తయిన చరిగొండ బండల గుండెల్లో అచేతన స్థితి ఏర్పడింది.

హంస ఎగిరిపోయింది

పరమహంసలో కలిసిపోయిందని ఓ పక్షి అలా అలా ఆకాశంవైపుగా సాగిపోయింది.

ధర్మో రక్షతి రక్షితః

ధర్మాన్ని మీరు రక్షించండి - అది మిమ్ములను రక్షిస్తుంది.

శ్లోకాలు - స్తోత్రాంశాలు

(1989లో శ్రీ శ్రీపతి వీరారెడ్డిగారు అమెరికా వెళ్లారు. పూజా అనుష్ఠానం అక్కడి హిందూ గృహాల్లో ఏదో విధంగా ప్రవేశ పెట్టాలనుకొన్నారు. పిల్లలు అప్పటికే తెలుగు అక్షరాలు గుర్తు పట్టలేకపోతున్నారు. రోజూ ప్రార్థన - ధ్యానం చేయించాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అందుకే ఈ క్రింది స్తోత్ర శ్లోకాలను ఇంగ్లీషులోకి లిప్యంతరీకరణం చేసి పంచి పెట్టారు. అవి వందల వేల కుటుంబాలకు ప్రచార ప్రసార సాధనాల ద్వారా చేరాయి. అలా అమెరికాలో ఎన్నో హిందూ కుటుంబాలలో ప్రార్థనలు - పూజలు చేసుకొనే అవకాశం కల్పించారు. ఈ శ్లోకాలు 2006 డిసంబర్ 5వ తేదీన ఆమనగల్లులో జరిగిన 26వ వేదాంత విజ్ఞాన మహాసభలలో జిరాక్సు కాపీలు పంచి పెట్టారు. అప్పుడు ముద్రించాలనుకొన్నారు. వీలు కాలేదు. ఇప్పుడు జీవన రేఖలలో అందించగలుగుతున్నాం.)

1. ఓం భూర్భువస్వహా - తత్సవితుర్వరేణ్యమ్
   భర్గో దేవస్య ధీమహీ - ధియోయోనః ప్రచోదయాత్ ॥

2. ఓం శుక్లాంబరధరం విష్ణుం - శశివర్ణం చతుర్భుజమ్,
   ప్రసన్నవదనం ధ్యాయేత్ - సర్వ విఘ్నోపశాంతయే ॥

3. ఓం శాంతాకారం, భుజగశయనం, పద్మనాభం, సురేశం
   విశ్వాకారం, గగనసదృశం, మేఘవర్ణం, శుభాంగమ్ ।
   లక్ష్మీకాంతం, కమలనయనం, యోగి హృద్ధ్యానగమ్యం
   వందే విష్ణుం, భవభయహరం, సర్వలోకైకనాథమ్ ॥

4. ఓం సరస్వతీ నమస్తుభ్యం - వరదే కామరూపిణీ ।
   విద్యారంభం కరిష్యామి - సిద్ధిర్భవతు మేసదా ॥

5. పద్మపత్ర విశాలాక్షీ - పద్మకేసర వర్ణినీ ।
   నిత్యం పద్మాలయా దేవీ - సామాం పాతు సరస్వతీ ॥

6. ఓం గురుర్ బ్రహ్మ గురుర్ విష్ణుః
గురుర్దేవో మహేశ్వరః ।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మ
తస్మై శ్రీ గురవే నమః ॥

7. ఓం వినాయకం గురుంభావం - బ్రహ్మ విష్ణు మహేశ్వరాన్ ।
సరస్వతీం ప్రణమ్యాదౌ - సర్వ కార్యార్థ సిద్ధయే ॥

8. ఓం కృష్ణం కమల పత్రాక్షం - పుణ్య శ్రవణ కీర్తనమ్ ।
వాసుదేవం జగద్యోనిం - నౌమి నారాయణం హరిమ్ ॥

ఓం ఐః సరస్వత్యై నమః
ఓం నమో నారాయణాయ
ఓం నమో భగవతే వాసుదేవాయ
ఓం నమశ్శివాయ

9. ఓం హరేరామ హరేరామ - రామరామ హరే హరే ।
హరే కృష్ణ హరే కృష్ణ - కృష్ణ కృష్ణ హరే హరే ॥

10. ఓం త్ర్యంబకం యజామహే
సుగంధం పుష్టి వర్ధనమ్ ।
ఉర్వారుకమివ బంధనాత్
మృత్యోర్ముక్షీయ మామృతాత్ ॥

(ఈ మృత్యుంజయ మంత్రం ప్రతిదినం భక్తి శ్రద్ధలతో 108 పర్యాయాలు జపించాలి. ప్రమాదాల నుండి, అపమృత్యుభయం నుండి కాపాడబడతారు. దీర్ఘాయువు శాంతి, సౌఖ్యాలు కలుగుతాయి.)

11. ఓం సర్వేషాం స్వస్తిర్భవతు
ఓం సర్వేషాం శాంతిర్భవతు ।
ఓం సర్వేషాం పూర్ణం భవతు
ఓం సర్వేషాం మంగళం భవతు ॥

12. ఓం సర్వే భవంతు సుఖినః - సర్వే సంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు - మా కశ్చిత్ దుఃఖభాగ్భవేత్ ॥

13. ఓం అసతోమా సద్గమయ
తమసోమా జ్యోతిర్గమయ
మృత్యోర్మా అమృతంగమయ ॥

14. ఓం పూర్ణ మదః పూర్ణ మిదం - పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణ మాదాయ - పూర్ణమేవావశిష్యతే॥

ఓం శాంతిః శాంతిః శాంతిః

15. ఓం ఆదిత్యాయచ సోమాయ మంగళాయ బుధాయచ ।
గురుశుక్ర శనిభ్యశ్చ రాహవే కేతవే నమః ॥

16. ఓం అహం వైశ్వానరో భూత్వా - ప్రాణినాం దేహ మాశ్రితః ।
ప్రాణాపాన సమాయుక్తః - పచామ్యన్నం చతుర్విధమ్ ॥

17. ఓం బ్రహ్మార్పణం బ్రహ్మ హవి -ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ ।
బ్రహ్మైవ తేన గంతవ్యమ్ - బ్రహ్మకర్మ సమాధినా ॥

18. ఓం అన్నపూర్ణే సదాపూర్ణే - శంకర ప్రాణ వల్లభే ।
జ్ఞాన వైరాగ్య సిద్ధ్యర్థమ్ - భిక్షాం దేహీచ పార్వతీ ॥

19. ఓం సర్వ మంగళ మాంగల్యే - శివే సర్వార్థ సాధకే ।
శరణ్యే త్ర్యంబకే దేవీ - నారాయణి నమోస్తుతే ॥

20. ఓం కల్యాణాత్మక గాత్రాయ - కామితార్థ ప్రదాయినే ।
శ్రీమద్ వేంకట నాథాయ - శ్రీనివాసాయ మంగళమ్ ॥

ఓం సర్వే జనాస్సుఖినోభవంతు

1989లో శ్రీ శ్రీపతి వీరారెడ్డి అమెరికాలో పంచి పెట్టిన ప్రార్థన పత్రం.

(దివ్యజీవన సంఘం వారి ప్రార్థన)

విశ్వప్రార్థన

ఓ! పూజ్యప్రభూ ! క్షమాపరిపూర్ణ ! ప్రేమమయా !
నీకు నమస్కృతులు, సాష్టాంగ ప్రణామములు.
నీవు సచ్చిదానందుడవు, సర్వాంతర్యామివి.
సర్వశక్తిమయుడవు, సర్వజ్ఞుడవు.
సర్వజీవ హృదయాంతర్వాసివి.
కరుణార్ద్ర హృదయము, సమదృష్టి, స్థిర మనస్సు,
భక్తి, విశ్వాస, జ్ఞానములు, మాకు ప్రసాదింపుము.
ఆకర్షణ లణగద్రొక్కి చిత్తవృత్తుల నరికట్టుటకు
మాకు వలయు అంతరాధ్యాత్మిక శక్తి నొసంగుము.
కామ, లోభ, ద్వేషముల బారి నుండి మమ్ము తప్పింపుము.
మా హృదయ ఫలకములను సద్గుణములతో నింపి వేయుము.
ఈ సర్వనామ రూపములలో నిన్ను తిలకింపనిమ్ము.
ఈ సర్వనామ రూపములలో నిన్ను సేవింపనిమ్ము.
నిన్ను సదా స్మరించుకొననిమ్ము.
నీ లీలలు సదా గానము చేయనిమ్ము.
నీ నామము సదా మా పెదవులపై నుండనిమ్ము.
నీలో సదా మమ్ము వసింపనిమ్ము.

సద్గురు సాహితిలో అంకితం సందర్భంగా కృతి గ్రహీత శ్రీపతి వీరారెడ్డి పరిచయం

1. శ్రీశ్రీశ్రీ త్రిపురాంతకేశ్వర శ్రీ వీరభద్రస్వామి ఆలయాల మేనేజింగ్ ట్రస్టీ
2. దేవాలయ కమిటి వ్యవస్థాపక అధ్యక్షులు
3. స్వగ్రామం ఎక్వపల్లి, ఆమనగల్లు మండలం, పాలమూరు జిల్లా
4. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అనేక శాఖల్లో పనిచేసి రెవిన్యూ శాఖలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పదవీ విరమణ చేశారు.
5. ఉత్తమ అధికారిగా ప్రభుత్వం చేత అవార్డు గ్రహించారు; సన్మానింపబడ్డారు.
6. శ్రీ వీరభద్రేశ్వర స్వామికి పూజా పునస్కారాలకై భూమి దానం చేశారు.
7. 2000 సంవత్సరం జన్మభూమి కార్యక్రమంలో లోకల్ కంట్రిబ్యూషన్ క్రింద లక్ష రూపాయల వ్యక్తిగత విరాళం ఇచ్చారు.
8. స్వగ్రామంలో సామాజిక వికాస కేంద్రాల నిర్మాణానికి భూమినిచ్చారు.
9. అయ్యసాగర క్షేత్రం వికసించడానికి ఎంతో కృషి చేశారు.
10. డా॥ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, వీరి అనుశాసనయుత సేవలకు ప్రశంసలందుకొన్నారు.
11. గ్రామాల వికాసమే దేశ వికాసమని విశ్వసించినవారు.
12. హిందూ ధర్మంలో ప్రపంచానికే మార్గదర్శనం చేసే ఉత్తమ గుణాలున్నాయని వారు వివరిస్తుంటారు.
13. హిందువుల ఏకత వల్లనే ఈ దేశం వికసిస్తుందని నొక్కి చెబుతుంటారు.
14. హింసా దౌర్జన్యాల వల్ల ప్రగతి కుంటుపడుతుందని, ఏ సమస్య అయినా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని వారి ఆశయం.

సద్గురు సాహితీ గ్రంథంలో
శ్రీశ్రీపతి వీరారెడ్డి దంపతులకు అంకితం పద్యాలు

ధర్మ జాగరణమ్ముకై దారి ఇదియె
అనుచు మార్గమ్ము బోధింతురనవరతము
ప్రజల సంఘటనమ్ముకు భక్తి మూల
మంచు ప్రవచింత్రు చరియింత్రు నమలు పరచ.

విద్య వైద్యమ్ము సేద్యమ్ము వివిధ గతుల
ఎదుగ గానెంచి సేవల నెన్నొ చేసి
పదవి విరమణానంతరం పాటు పడుతు
దేశ సేవను చేసెడు ధీయుతుండు.

శ్రీపతి వీరారెడ్డియు
చేపట్టిన కార్యములకు శ్రీ ఫలమిదియే
తాపలుకు వీరభద్రుని
కాపాడగ నిలిపెనయ్య కాసారమునన్.

తన గుణమ్ములు జనములు మనసు దలప
తన ధనమ్ములు గుడిబడి ధరణి నిలుప
తనదు కార్యాలు నలుగురు తనిసి పొగడ
ధర్మ మార్గానుయాయియై తాను నిలిచె

వారి ధర్మపత్ని వారి మార్గమ్ములో
తాను నడచుచుండె జ్ఞానమరసి
అట్టి దంపతులకు అంకితమియ్యది
గురునితత్త్వమండి! గురుతుగనుడు!

వైదిక సంధ్య (ఉపాసన) మంత్రము
(శ్రీ మద్దయానందుని పంచమహాయజ్ఞ విధిని అనుసరిస్తూ)

1. **గురు మంత్రము**

ఓం భూర్భువః స్వః! తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహీ, ధియో యోనః ప్రచోదయాత్ ॥

2. **ఆచమన మంత్రము**

ఓం శన్నో దేవీరభీష్టయ ఆపోభవంతు పీతయే
శంయో రభిస్రవంతు నః॥

3. **ఇన్ద్రియ స్పర్శ మంత్రములు**

ఓం వాక్, వాక్ ॥ ఓం ప్రాణః ప్రాణః॥
ఓం చక్షుః చక్షుః ఓం శోత్రమ్ శోత్రమ్ ॥
ఓం నాభిః ఓం హృదయమ్॥
ఓం కంఠః॥ ఓం శిరః॥
ఓం బాహుభ్యాం యశోబలమ్॥
ఓం కరతల కరపృష్ఠే॥

4. **మార్జన - మంత్రములు**

ఓం భూఃపునాతుశిరసిః
ఓం భువః పునాతునేత్రయోః
ఓం స్వఃపునాతు కంఠే
ఓం మహః పునాతుహృదయే!
ఓం జనః పునాతునాభ్యామ్॥
ఓం తపః పునాతు పాదయోః
ఓం సత్యం పునాతుః పునః శిరసి!
ఓం ఖం బహ్మ పునాతు సర్వత్ర

5. ప్రాణాయామ - మంత్రము

ఓం భూః ఓం భువః ఓం స్వః ఓం మహః
ఓం జనః ఓం తపః ఓం సత్యమ్॥

6. ఆఘమర్షణ - మంత్రములు

ఓం ఋతం చ సత్యం చాభీద్ధాత్త పసో ధ్యజాయత
తతో రాత్ర్యజాయత తతః సముద్రో అర్ణవః
ఓం సముద్రాదర్ణ వాదధి సంవత్సరో అజాయత
అహో రాత్రాణి విదధద్విశ్వస్య మిషతో వశీ॥
ఓం సూర్యాచంద్రమసౌ ధాతా యథా పూర్వమ కల్పయత్
దినం చ పృథివీం చాంతరిక్ష మధో స్వః ॥

ఆచమన మంత్రములు

ఓం శన్నో దేవీరభీష్టయ ఆపో భవంతు పీతయే
శంయోరభిస్రవంతునః

మనసా పరిక్రమణ - మంత్రములు

ఓం ప్రాచీ దిగగ్ని రధిపతి రసితో రక్షితాదిత్యా
ఇషవః । తేభ్యోనమోధిపతిభ్యోనమో రక్షితృభ్యో
నమః । ఇషుభ్యో నమ ఏభ్యో అస్తు। యోస్మాన్
ద్వేష్టి యం వయం ద్విష్మస్తం వో జంబే దధ్మః॥
ఓం దక్షితా దిగింద్రోధిపతి స్థిరశ్చి రాజీ
రక్షితా పితర ఇషవః తేభ్యోనమోధి
పతిభ్యో నమో రక్షితృభ్యో
నమః ఇషుభ్యోనమ ఏభ్యో అస్తు యోస్మాన్ ద్వేష్టి
యం వయం ద్విష్మస్తం వో జంభే దధ్మః ॥

ఓం ఉదీచీ దిక్ సోమోధిపతిః స్వజో రక్షితాశని
రిషవః। తేభ్యో....... జంబే దధ్మః॥
ఓం ధ్రువా దిగ్విష్ణు రధిపతిః కల్మాషగ్రీవో రక్షితా
వీరుధ ఇషవః । తేభ్యో .... జంబే దధ్మః
ఓం ఉద్ధ్వా దిగ్బృహస్పతి రధిపతిః శ్విత్రో రక్షితా
వర్షమిషవః తేభ్యో............ జంభే దధ్మః॥

9. ఉపస్థాన మంత్రములు

ఓం ఉద్వయం తమసస్పరిస్వః పశ్యంత ఉత్తరమ్!
దేవం దేవత్రా సూర్యగమన్మ జ్యోతి రుత్తమమ్!
ఓం ఉదుత్యం జాత వేదసం దేవం వహంతి
కేతవః దృ శేవిశ్వాయ సూర్యం॥
ఓం చిత్రం దేవనాముదగా దనీకం చక్షుర్మిత్ర స్య
వరుణస్యాగ్నేః । ఆప్రాద్యావా పృథివీ అంతరిక్షగ్ం
సూర్య ఆత్మా జగత స్తస్థుషశ్చ స్వాహా ॥
ఓం తచ్చక్షుర్దేవహితం పురస్తాచ్చుక్ర ముచ్చరత్ ॥
పశ్యేమ శరదః శతం, జీవేమ శరదః శతం.
శ్రుణుయామ శరదః శతం, ప్రబ్రవామ శరదః
శతమదీనాః స్యామశరదః శతం భూయశ్చ
శరదః శతాత్

10. గురు మంత్రము

ఓం భూర్భువః స్వః తత్స వితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహీ । ధియో యోనః ప్రచోదయాత్॥
హే ఈశ్వర దయానిధే భవత్కృపయా అనేన
జపాపసనాది కర్మణా ధర్మార్థ కామ మోక్షాణాం సద్య స్సిద్ధిర్భవేన్నః ॥


11. నమస్కార మంత్రము

ఓం నమః శంభవాయ చ మయోభవాయ చ ।
నమః శంకరాయ చ మయస్క రాయచ ।
నమః శివాయ చ శివతరాయ చ॥

12. శాంతి మంత్రము

ఓం ద్యౌః శాంతిః అన్తరిక్షగ్ంం శాంతిః
పృథివీ శాంతిరాపః శాంతిః
ఓషధయః శాంతిః।
వనస్పతయః శాంతిః
విశ్వేదేవా శాంతిః
బ్రహ్మశాంతిః
సర్వగ్ంం శాంతిః
శాంతి రేవశాంతిః
సామా శాంతి రేధి ॥

(శ్రీ శ్రీపతి వీరారెడ్డి గారు ఈ వైదిక సంధ్య మంత్రాలు కూడా వ్రాసి, పంపిణీ చేశారు. అగ్ని ఉపాసన చేసేవారు ఎవరికి వారు ఈ మంత్రాలతో హోమం చేసుకోవచ్చు నని ఆశించారు)



శ్రీ త్రిపురాంతకేశ్వర, శ్రీ వీరభద్రస్వామి దేవాలయ కమిటి

1. శ్రీ శ్రీపతి వీరారెడ్డి, అధ్యక్షులు - ఎక్వపల్లి
2. శ్రీ కె. వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు - ఆకుతోటపల్లి
3. శ్రీ ఎల్. విష్ణువర్ధన్ రెడ్డి, కార్యదర్శి - కోనాపురం
4. శ్రీ ఎం. మల్లప్ప, కోశాధికారి - కద్తాల
5. శ్రీ డి. జంగయ్య, సభ్యులు, కోనాపురం.
6. శ్రీ బి. ఎల్లారెడ్డి, కర్కల్ పహాడ్.
7. శ్రీ బి. ఉమ్లా నాయక్, రాంనూతల
8. శ్రీమతి ఎన్.టి. శివలీలమ్మ, భర్త శ్రీ సాదులప్ప - కోనాపురం
9. శ్రీ జి. జంగయ్య - కద్తాల
10. శ్రీ ఎం.కె. వీరేశం, విఠాయిపల్లి
11. శ్రీ శివకోటప్ప, చౌదర్‌పల్లి
12. శ్రీ పి. వీరయ్య, తండ్రి బ్రహ్మయ్య, కోనాపురం
13. శ్రీ ఎల్. జైహింద్ రెడ్డి, కోనాపురం
14. శ్రీ గోవిందు యాదయ్య, ఆకుతోటపల్లి
15. శ్రీ శ్రీపతి యాదగిరి రెడ్డి, ఆకుతోటపల్లి
16. శ్రీ మంద యాదవరెడ్డి, చంపాపేట, హైదరాబాదు
17. శ్రీ పెరుమాళ్ల సచ్చిదానందరెడ్డి, హైదరాబాదు
18. శ్రీ సురిశెట్టి సిమ్మయ్య, గట్టిప్పుల పల్లి
19. శ్రీ జి. శంకరప్ప, సికింద్రాబాదు
20. **శ్రీ బట్టు నర్సిరెడ్డి, దేవాలయభివృద్ధి సంఘ అధ్యక్షులు, కొల్కులపల్లి.**

మహా మృత్యుంజయ మంత్రము



ఓం త్ర్యంబకం యజామహే
సుగంధిం పుష్టి వర్ధనమ్ ।
ఉర్వారుక మివ బంధనాత్
మృత్యోర్ముక్షీయ మామృతాత్ ॥

తా॥ దోసకాయను తొడిమ నుండి సులువుగా త్రుంచివేసినటుల, మృత్యు బంధము నుండి మమ్ముద్ధరించి అమరత్వ మొసంగుటకు సర్వజీవులకు పోషణకర్తయు, దివ్య పరిమళము గల దేహము గల వాడును అగు ముక్కంటిని ఆరాధించెదము.

(ఈ మృత్యుంజయ మంత్రము ప్రాణముల నివ్వ సమర్థమైనది, రోగముల నివారించుటలో, ప్రమాదముల తొలగించుటలో దీనికి పెట్టినది పేరు. ఇది రోగములన్నింటికి వజ్రాయుధము వంటిది. ఇది మృత్యువును జయించు మంత్రము.

ప్రతిదినము భక్తి శ్రద్ధలతో ఈ మంత్రము కనీసము 108 సార్లు జపించినచో, ఏ విధమైన ప్రమాదము వలన, అపమృత్యు భయము లేకుండ కాపాడుటయే గాక, దీర్ఘాయువును, శాంతి, సౌఖ్యములను ప్రసాదించును.

ఇంతేగాక ఇది మోక్ష ప్రదమగు మంత్రము కూడా. ఇది పరమ శివుని మంత్రము. నిరంతరము జపించువారికి అమరత్వమును గూడ ప్రసాదింపగలదు.)



శ్రీపతి వీరారెడ్డి శ్రీమతి అహల్యాదేవి దంపతులు, కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాళ్ళు...